

మంత్రి బీసీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్ఈ సుధాకర్, ఇతర అధికారులు

నాణ్యమైన విద్యుత్తు అందించండి: మంత్రి బీసీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలని ఎస్ఈ సుధాకర్‌కు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని బనగానపల్లిలో ఎస్ఈ సుధాకర్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యుత్తుపరంగా వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల విషయంలో అప్రమత్తంగా ఉండి విద్యుత్తు కోతలు లేకుండా చూడాలని సూచించారు. గృహ వినియోగదారులకు విద్యుత్తు అంతరాయం రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ విద్యుత్తుకు అంతరాయం ఉంటే ముందుగానే వినియోగదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాణ్యమైన విద్యుత్తు ఇచ్చేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు.

బీఈడీ పరీక్ష వాయిదా

■ ఓ కళాశాల తీరు ఇందుకు కారణం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఓ కళాశాల నిర్వాహకుల తీరు కారణంగా రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరగాల్సిన పరీక్షను వాయిదా వేయాల్సి వచ్చింది. బీఈడీ మొదటి ఏడాది ఒకటో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభయ్యాయి. మొత్తం 17 కేంద్రాల్లో సుమారు 4,500 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. శుక్రవారం ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఎర్నింగ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ పరీక్ష జరగాల్సి ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. 1.50 గంటల ప్రాంతంలో పరీక్షను 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలపడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. అసలు పరీక్ష ఎందుకు వాయిదా వేశారో అర్థంకాక అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఆరా తీయగా.. నంద్యాల పట్టణ కేంద్రంలోని ఎస్వీవై రెడ్డి డిగ్రీ కళాశాలలో 25వ తేదీన జరగాల్సిన పరీక్ష ప్రశ్నపత్రం ఒక రోజు ముందే.. 24వ తేదీన విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత దానిని వెనక్కి తీసుకున్నారు. ఈ విషయాన్ని అప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారు. ఆర్‌యూ అధికారులకు శుక్రవారం ఆలస్యంగా సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి పరీక్ష వాయిదా వేయాలని నిర్ణయించారు. వెంటనే బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ శుక్రవారం జరగాల్సిన పరీక్షను 30వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

వ్యాయామమ అనిపించారు

జిల్లా కేంద్రం నంద్యాలలోని వైఎస్సార్‌నగర్ పార్కులో కొన్నేళ్ల కిందట బహిరంగ వ్యాయామ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.లక్షల వ్యయం చేసి పరికరాలను ఏర్పాటు చేసిన పురపాలక అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. పార్కులో సైతం కంప చెట్లు పెరిగి అధ్వానంగా మారింది. ఇటువైపు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. వ్యాయామ పరికరాల భాగాలన్నీ మాయమై దిష్టిబొమ్మల్లా మిగిలాయి. ఒక్కటీ వినియోగానికి అనువుగా లేవు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి వ్యాయామ పరికరాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



కునుకు రాక ఉల్లికిపాటు

■ కర్నూలు మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి ■ క్రయవిక్రయాలు ఆపేసిన వ్యాపారులు



బారులు తీరిన ట్రాక్టర్లు

ఉల్లి రైతులకు కంటి మీద కునుకు కరవైంది.. అమ్మకానికి పంట తీసుకొచ్చిన వారు జాగరణ చేయాల్సి వస్తోంది.. అధికారులకు ముందస్తు వ్యూహం లేకపోవడంతో కర్షకులు రోడ్డుపై పడ్డారు. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది కర్నూలు వ్యవసాయ విపణికి ఉల్లి పోటెత్తుతోంది. గత నెల రోజులుగా ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరుస కట్టారు. నిత్యం రికార్డు స్థాయిలో 20–22 వేల క్వింటాళ్ల వరకు వస్తోంది.. వ్యాపారులు కొనుగోలు చేసి సరకును సకాలంలో బయటకు తరలించలేకపోయారు.. ప్రస్తుతం ఆరు వేల టన్నుల వరకు నిల్వలు పేరుకుపోయాయి.. ఉల్లి గుట్టలు ఖాళీ చేసిన తర్వాతనే సరకును కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.. అప్పటి వరకు రైతులంతా రోడ్లపై నిరీక్షించాల్సిందే.

-కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే :

తేదీ	క్వింటాళ్లు	గరిష్ఠం (రూ.)	మధ్యస్థం (రూ.)	కనిష్ఠం (రూ.)
18	5,046	4,219	3,968	667
19	4,643	4,329	3,591	495
21	13,070	4,389	3,674	769
22	9,736	4,429	3,919	539
23	19,870	4,581	3,589	444
24	19,711	4,639	3,888	444
25	22,500	(కొనుగోళ్లు జరగలేదు)		

3 రోజులు.. 65,500 క్వింటాళ్లు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 17,763 హెక్టార్లలో ఉల్లి సాగైంది. ఉల్లి కొనుగోళ్లకు కర్నూలు మార్కెట్ ప్రసిద్ధి. ఇక్కడికి ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులతోపాటు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రైతులు సరకు తీసుకొస్తుంటారు.

ఈ సీజన్‌లో ఆగస్టు నుంచి విక్రయాలు ప్రారంభయ్యాయి. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులంతా మార్కెట్‌కు వరుస కట్టారు. గత మూడు రోజుల వ్యవధిలో 67,500 క్వింటాళ్లు వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సర్వర్.. ఎర్రర్..

ఈ.నామ్ విధానం అమలవుతున్న విపణుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. నాలుగైదు రోజులైనా పరిష్కరించకపోవడంతో వ్యాపారులు మాన్యువల్‌గా టెండర్లు వేస్తున్నారు. టెండర్లు వేసే ప్రక్రియ పూర్తై ధర ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



నిశీధిలో తూకాలు

ఈ.నామ్ విధానం పనిచేయకపోవడంతో వ్యాపారులు మాన్యువల్‌గా టెండర్లు వేస్తున్నారు. టెండర్లు వేసే ప్రక్రియ పూర్తై ధరలు ప్రకటించేందుకు సాయంత్రం 5 నుంచి 6 గంటలవుతోంది. రాత్రి 7 గంటలకు తూకాలు మొదలు పెడుతున్నారు.

గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు తూకాలు పూర్తి కాలేదు. బుధవారం సాయంత్రం మార్కెట్‌కు సరకును తీసుకొచ్చిన రైతు శుక్రవారం ఉదయం 10 గంటల తర్వాత ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. రేయింబవళ్లు విపణిలోనే నిరీక్షిస్తున్నారు.

అధికారుల ఘోర వైఫల్యం

గతంలో ఇంతకంటే అధిక మొత్తంలో అన్నిరకాల పంట ఉత్పత్తులు వచ్చిన సమయంలోనూ ఏనాడు మార్కెట్‌లో క్రయవిక్రయాలు ఆపేసిన దాఖలాలు లేవు. మార్కెట్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం..వ్యాపారులు. రైతులను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారు.

నిత్యం మధ్యాహ్నం 2 గంటలలోపు ధరలు ప్రకటించి ఉల్లి క్రయ విక్రయాలు జరిగేలా చూస్తే విపణిని పూర్తిస్థాయిలో బంద్ చేసే పరిస్థితి ఉండదు.. సాయంత్రం 5-రాత్రి 7 గంటల లోపు తూకాలు పూర్తవుతాయి.

గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో తూకాలు వేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పత్తా లేకుండా పోయారు. తూకాలు ఎవరు వేస్తున్నారు.. మోసాలేమైనా జరుగుతున్నాయా అన్న విషయాన్ని పట్టించుకోలేదు.

సరకు కుళ్లిపోతోంది



-మద్దయ్య, వెంకటనాయనిపల్లె, డోన్ మండలం

1.50 ఎకరాల్లో ఉల్లి సాగు చేశా.. 172 ప్యాకెట్లు బుధవారం తీసుకొచ్చా.. మూడు లాట్లుగా పోసి విక్రయానికి పెట్టా. బుధ, గురువారాల్లో ఏ ఒక్క వ్యాపారి రాలేదు. ధర కోట్ చేయలేదు. మూడు రోజులవుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. సరకు తెచ్చిన రోజు నుంచి గ్రేడింగ్ చేయిస్తున్నారు. దీనికిగాను కూలీలకు డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజుకు 10 ప్యాకెట్ల ఉల్లి కుళ్లిపోతోంది.. ఇప్పటికే 20 ప్యాకెట్లు పారబోశాను.


అన్నదాతకు ఆకలిమంట



అందరికీ అన్నం పెట్టే అన్నదాత పంట అమ్ముకోవడానికి పస్తులుండాల్సి వస్తోంది. కర్నూలు మార్కెట్‌కు పంట తీసుకొచ్చే రైతులకు మధ్యాహ్న భోజనం రాయితీపై అందిస్తారు. నిత్యం ఎంత మంది రైతులు మార్కెట్‌కు సరకు తీసుకొస్తున్నారో వారందరికీ భోజనం అందించాల్సి ఉంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 22,500 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు విపణికి వచ్చాయి. మరోవైపు ఎంతమంది రైతులు సరకు తీసుకొస్తున్నారన విషయాన్ని మార్కెట్ కమిటీ అధికారులు ఇస్కాన్ వారికి స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వారు రోజువారీ అంచనా ప్రకారం 400 మందికి భోజనం పెట్టారు. మిగిలిన వారందరూ బయట తినాల్సిన పరిస్థితి. చాలా మంది సరకు వదిలి వెళ్లలేక ఆకలితో అల్లాడిపోయారు.

వ్యాపారులు ధర తగ్గించారు

-రాంభూపాల్, కౌలురైతు, పంచలింగాల



బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50-60 పలుకుతోంది.. ఇక్కడి వ్యాపారులు ఒక్కటై రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు లాట్లను రూ.4 వేలు పెడుతున్నారు. మిగిలిన సరకును రూ.1,500-2 వేల లోపు ధరకు తీసుకుంటున్నారు. 1.60 ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తే 120 ప్యాకెట్ల దిగుబడి వచ్చిందని.. రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టా.. విపణిలో ధర చూస్తే క్వింటా రూ.2 వేలకు మించి ధర రావడం లేదు.

ఉల్లి కొనుగోళ్ల నిలిపివేత

కర్నూలు మార్కెట్లో కొనుగోలుచేసిన సరకును బయటకు తరలించేందుకు మరో మూడు పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం వచ్చిన 50 వేల ప్యాకెట్ల ఉల్లిని శనివారం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆదివారం సెలవు, సోమవారం కూడా మార్కెట్‌లో ఉల్లితోపాటు అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. రైతులు మార్కెట్‌కు సరకును తీసుకురావొద్దని విన్నవించారు.


దారితప్పిన పనులు రద్దు

గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి శాపంగా మారింది. ఆర్బాటంగా పనులు ప్రకటించినా ఆచరణలో నిధులు విడుదల చేయలేదు. రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరు ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది.. ఇటీవల అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది.. గత ప్రభుత్వంలో ప్రారంభం కానివి.. 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు రద్దు చేయాలని నిర్ణయించింది. వాటిలో అత్యవసరమైన ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రతిపాదించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

● పథకం పేరు ● రద్దయ్యే పనులు ● వాటి విలువ (రూ.కోట్లలో)

పథకం పేరు	రద్దయ్యే పనులు	వాటి విలువ (రూ.కోట్లలో)
భవన నిర్మాణాలు	21	183.24
ఎండీఆర్ ప్లాన్	9	10.12
ఎండీఆర్ (ఆర్ఐడీఎఫ్)	6	30.23
ఎస్‌హెచ్- ప్లాన్	4	9.23
ఎస్‌హెచ్ (ఆర్ఐడీఎఫ్)	8	32.12
సీఆర్ఐఎఫ్	11	123.56
జిల్లా మినరల్ ఫండ్	18	9.35
పీహెచ్‌సీ ఎస్- న్యూ	6	15.98
మరమ్మతులు ఐబీఎస్	2	1.23
బీపీహెచ్‌యూ ఫేజ్-I	4	0.56
బీపీహెచ్‌యూ ఫేజ్-2	13	2.58



నంద్యాల జాయింట్ కలెక్టర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

కలెక్టరేట్ సముదాయానికి గ్రహణం

● నంద్యాలలో కలెక్టరేట్ సముదాయం పనులు రద్దు జాబితాలో చేర్చారు. ఆర్‌ఏఆర్ఎస్‌లో 11 ఎకరాల విస్తీర్ణంలో రూ. 98.55 కోట్లతో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు కేటాయించారు. పనులు ప్రారంభించ లేదు. కలెక్టర్ క్యాంప్ ఆఫీసు ఆధునికీకరణకు రూ. 2.50 కోట్లు, జాయింట్ కలెక్టర్ బంగ్లా, క్యాంప్ కార్యాలయం నిర్మాణానికి రూ. 2.50 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభించ లేదు.

● బ్రాహ్మణకొట్కూరు-మిడుతూరు రోడ్డుకు రూ. 2 కోట్లు, బనగానపల్లి పట్టణంలో బైపాస్ రహదారి నిర్మాణానికి రూ. 35.15 కోట్లు, ఆళ్లగడ్డ- మాయలూరు మధ్య కుందూ నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5 కోట్లు, బేతంచెర్లలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం రూ. 26 కోట్లు కేటాయించింది.

107 పనుల్లో ప్రగతి 25 శాతంలోపే

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 శాతం లోపు జరిగిన పనులనూ రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పనుల వివరాలు ఇప్పటికే ప్రభుత్వం సేకరించింది. నంద్యాలలో 35, కర్నూలులో 72 వరకు ఉన్నాయి. ప్రత్యేకించి సీఆర్ఎఫ్, గ్రామీణ రోడ్లు ఇందులో ఉన్నాయి. తుంగభద్ర పుష్కరాల పనులూ ఇప్పటి వరకు ప్రారంభమేకాకపోవడం గమనార్హం.

రూ.273 కోట్ల పనులపై నివేదిక

కర్నూలు జిల్లాలో తుంగభద్ర పుష్కరాలకు సంబంధించిన 21 పనుల్లో 14 పూర్తయ్యాయి. ఏడు ప్రారంభమే కాలేదు. కోర్ నెట్ ప్లాన్‌కు సంబంధించి మూడు మొదలు పెట్టలేదు. న్యాయస్థానాల భవనాల పనులూ రద్దు చేశారు. కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో రూ.4 కోట్ల విలువ చేసే నాలుగు పనులు రద్దు జాబితాలో ఉన్నాయి.

రహదారుల అభివృద్ధికి విఘాతం

ఉమ్మడి జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా నివేదిక కోరింది. ఒకే వరుస(సింగిల్) ఉన్న రహదారులను రెండు వరుసలుగా మార్చేందుకు ఐదేళ్ల కిందట నిధులు విడుదలయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో ఆయా రహదారులు అభివృద్ధికి నోచుకోలేకపోయాయి. నంద్యాల జిల్లాలో 8 రహదారులకు రూ. 178.41 కోట్లు మంజూరు కాగా ఒక్కటే పూర్తయింది. దీనికి రూ. 6.80 కోట్లు ఖర్చు చేశారు. మిగతా ఏడు రహదారుల నిర్మాణం ప్రారంభమే కాలేదు.

అక్రమాల తీగలాగుతున్నారు

■ తుక్కు పేరుతో దోపిడీ పర్వం
■ విద్యుత్తు శాఖ అధికారుల దందా
■ రాగి, అల్యూమినియం తీగ స్వాహాపై విజిలెన్స్ విచారణ
■ 'ఈనాడు' కథనానికి స్పందన



నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తుక్కు పేరుతో విద్యుత్తు శాఖలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. తుప్పు పట్టిన తీగలు, కమ్మీలు ఇష్టానుసారం విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలిపోయిన నియంత్రికలు అక్రమార్కులకు రూ.కోట్లు కురిపించాయి. 'తీగ లాగితే రూ.5 కోట్ల అక్రమాలు' శీర్షికన గత నెల 28న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు అప్పట్లోనే వివరాలను కోరారు. ఆ వివరాలతో సంతృప్తి చెందని ప్రభుత్వం తాజాగా ఇక్కడ జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తుక్కు పేరుతో రూ.కోట్లు మెక్కిన అక్రమారుకల లెక్క తేల్చేందుకు విజిలెన్స్ అధికారులు రంగంలో దిగారు.

నాలుగేళ్ల వివరాల సేకరణ

నియంత్రికలకు సంబంధించిన రాగి, అల్యూమినియం తీగ పక్కదారి పట్టడంపై విద్యుత్తు శాఖ పరిధిలోని యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ (ఏపీటీఎస్) విజిలెన్స్ విభాగం రంగంలో దిగింది. ఆళ్లగడ్డలోని నియంత్రికల మరమ్మతు కేంద్రంలో రోజంతా తనిఖీలు చేపట్టారు. దీంతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మరమ్మతు కేంద్రాల్లో నాలుగేళ్ల పాటు జరిగిన లావాదేవీలకు సంబంధించిన వివరాలు సేకరించారు. కేంద్రాల్లో ఎన్ని నియంత్రికలకు మరమ్మతులు చేశారు? రైతులకు ఎన్ని అందజేశారు? ఈ కేంద్రాలకు ఎంత రాగి, అల్యూమినియం తీగ సరఫరా చేశారు? తుప్పు పట్టిన తీగలో కర్నూలు గోదాముకు ఎంత అప్పగించారు? అందజేశారన్న వివరాలను విజిలెన్స్ అధికారులు అడిగి తీసుకున్నారు.

అన్ని కేంద్రాలపై నిఘా

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది కేంద్రాలకు ఏడాదికి సగటున 2 వేల నుంచి 2,500 వరకు నియంత్రికలను మరమ్మతుల కోసం తెస్తుంటాయి. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. గత ఐదేళ్లలో రూ. 5 కోట్ల విలువైన రాగి, అల్యూమినియం స్క్రాప్ పక్కదారి పట్టింది.

గుట్టుగా విక్రయించారు

ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు నియంత్రిక మరమ్మతుల కేంద్రాలు తొమ్మిది ఉన్నాయి. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. వీటిలో తుప్పు పట్టిన రాగి, అల్యూమినియం తీగను కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా దారి మళ్లించారు. కేంద్రాల్లోని పాత సామగ్రిని ఎప్పటికప్పుడు కర్నూలు గోదాముకు తరలించాల్సి ఉంది. కానీ కొంత మాత్రమే తరలించి మిగతాది బయటి వ్యాపారులకు విక్రయించారు. మరమ్మతుల తర్వాత మిగిలిన స్క్రాప్‌కు సంబంధించి ఈ తొమ్మిది కేంద్రాల్లో సరైన వివరాలు నమోదు కాలేదు. తనిఖీ చేయాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. ఇదే సమయంలో ఆళ్లగడ్డ, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, డోన్ కేంద్రాల్లో కొన్ని నియంత్రికల వివరాలు లేవు. ఇవి ఏమయ్యాయన్న విషయమై విజిలెన్స్ అధికారులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. ఆళ్లగడ్డ కేంద్రంలో తనిఖీలు చేసిన విజిలెన్స్ అధికారులు మిగతా ఎనిమిది కేంద్రాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన నియోజకవర్గ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు పంపించారు. కొన్ని సమస్యలపై అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.



వినతులు పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పశు పోషకులు తమ ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి పశువుల సమగ్ర సమాచారాన్ని తెలియజేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పశు పోషకులు ఇచ్చే వివరాల ఆధారంగా వివిధ పథకాల రూపకల్పనకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఏహెచ్‌వో జి.గోవిందనాయక్, డీడీ డా.కె.శ్రీనివాసరావు, ఏడీ డా.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో | క్రీడలతోనే ప్రత్యేక గుర్తింపు | పతకాల కిక్ | జైన్ పరిశ్రమ అభివృద్ధికి కృషి | 8

పతకాల కిక్

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆ విద్యార్థినులు ఒకవైపు చదువులో రాణిస్తూ మరోవైపు క్రీడల్లోనూ సత్తాచాటుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహిస్తుండటంతో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొని పతకాల పంట పండిస్తున్నారు. ఆటలతో జీవితంలో ఉన్నతస్థితికి చేరాలని పడకండ్లలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు కోరుకుంటున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కరాటేలో గురుకులం విద్యార్థినులు ప్రతిభతో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

క్రీడాకోటాలో ఉద్యోగమే లక్ష్యం

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలోని పడకండ్ల గురుకులంలో ఇంటర్ చదువుతున్న జ్యోతి కరాటేలో అద్భుత ప్రతిభ చూపిస్తున్నారు. రాజంపేటలో ఈనెల 1న జరిగిన అంతర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమంగా రాణించారు. అండర్- 16 విభాగంలో ముగ్గురు ప్రత్యర్థులను చిత్తుచేసి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆమె ప్రతిభను మెచ్చిన సెలెక్టర్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె తర్ఫీదు పొందుతున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనేదే తన లక్ష్యమని జ్యోతి చెబుతున్నారు.



జ్యోతి

కరాటేలో సాధన



మేరీ కల్పన

పడకండ్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మేరీ కల్పనకు కరాటే అంటే ఎక్కువ మక్కువ. ఈ క్రీడలో రాణించాలనే లక్ష్యంతో సాధన ప్రారంభించారు. రాజంపేటలో అంతర రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొన్నారు. మూడు బౌట్‌లలో పాల్గొని ప్రత్యర్థులను మట్టి కరిపించి ఫైనల్‌కు చేరుకుని రెండో స్థానంలో నిలిచారు. అటాకింగ్, డిఫెన్స్, కిక్కింగ్‌లో అద్భుత స్కోర్ సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పతకాన్ని సాధించాలన్న లక్ష్యంతో కరాటేలో సాధన చేస్తున్నానని కల్పన చెబుతున్నారు.

పాడైన వంతెన.. రాకపోకలకు యాతన

కోవెలకుంట్ల నుంచి లింగాల మీదుగా నంద్యాల దారిలో చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల మధ్య కైప వాగు వంతెన శిథిలావస్థకు చేరింది. ఏళ్ల నాటి వంతెనకు తగిన మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇది పాడైంది. చిన్నకొప్పెర్ల వైపు మధ్యలో కుంగడంతో గోతులు ఏర్పడాయి. ఇది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఆదమరిచినా పెద్ద ప్రమాదమే జరగొచ్చని అంతా ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.



–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

క్రీడలతోనే ప్రత్యేక గుర్తింపు

○ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : క్రీడలతోనే ఎనలేని గుర్తింపు వస్తుందని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజు, డీవీఈవో పరమేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లాలప్ప, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గత 50 ఏళ్ల నుంచి క్రీడలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలతో క్రీడా పండగ వాతావరణం నెలకొందని చెప్పారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 900 మంది బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని ముఖ్య అతిథులు స్వీకరించారు.

బాలికల విభాగం: 100 మీటర్ల పరుగులో తిరుషా (విజయనగరం) స్వర్ణం, సాయిప్రియ (కర్నూలు) వెండి, నందిని (విజయవాడ) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. 800 మీటర్ల పరుగులో చైతన్య (విజయవాడ) స్వర్ణం, పావని (తూర్పు గోదావరి) వెండి, కల్యాణి (అనంతపురం) కాంస్యం సాధించారు. 400 మీటర్ల పరుగులో యశోద (విజయవాడ) స్వర్ణం, చైతన్య (విజయవాడ) వెండి, కీర్తన (గుంటూరు) కాంస్య పతకాలు అందుకున్నారు. హైజంప్‌లో లక్ష్మీతులసి (విజయనగరం) స్వర్ణం, చంద్రకళ (తూర్పు గోదావరి) వెండి, మీరా (విజయనగరం) కాంస్య పతకాలను సాధించారు.

బాలుర విభాగం: షాట్‌పుట్‌లో నాగవినయ్ (విశాఖ) స్వర్ణం, అభి (విశాఖ) వెండి, దిలీప్‌కుమార్ (చిత్తూరు) కాంస్య పతకం సాధించారు. 100 మీటర్ల పరుగులో గణేశ్ (నెల్లూరు), దరేశ్వర్ (విజయవాడ), జ్యోతీశ్వర్ (శ్రీకాకుళం) వరుస స్థానాల్లో నిలిచి పతకాలు గెలుచుకున్నారు. 800 మీటర్ల పరుగులో వెంకటేశ్ (కర్నూలు) స్వర్ణం, శేషు (గుంటూరు) వెండి, రాజేశ్ (విజయవాడ) కాంస్య పతకాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో మక్బుల్ హుసేన్ (కృష్ణా) స్వర్ణం, మహేంద్ర (కర్నూలు) వెండి, వినోద్‌కుమార్ (కర్నూలు) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. హైజంప్‌లో దుర్గాప్రసాద్ (కాకినాడ), సుదర్శన్ నాయుడు (చిత్తూరు), చైతన్య (గుంటూరు) వరుస పతకాలు అందుకున్నారు.



కర్నూలు క్రీడాకారుల కవాతు



చదరంగంలో తలపడుతూ..

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు, న్యూస్‌టుడే : యోగా, చదరంగం పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి అన్నారు. కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలోని ఇండోర్ స్టేడియం యోగా హాలులో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల యోగా, చదరంగం పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎస్.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి పరమేష్ తదితరులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ఉన్నత, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు.

కనులపండువగా చౌడేశ్వరిదేవి పల్లకి ఉత్సవం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకి ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిని అలంకరించి ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం పల్లకితో ప్రాకార ఉత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

జైన్ పరిశ్రమ అభివృద్ధికి కృషి



జైన్ పరిశ్రమ ఉత్పత్తుల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నందికొట్కూరు గ్రామీణం, జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : జూపాడుబంగ్లా మండలం తంగడంచలోని జైన్ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ రాజకుమారి చెప్పారు. ఎమ్మెల్యే జయసూర్యతో కలిసి శుక్రవారం ఆమె తంగడంచ విత్తనోత్పత్తి కేంద్రం, జైన్ పరిశ్రమను సందర్శించారు. ముందుగా విత్తనోత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ క్షేత్రంలోని 1600 ఎకరాల్లో విత్తనోత్పత్తి ఎలా చేయాలో నివేదిక తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం జైన్ పరిశ్రమకు వెళ్లారు. అక్కడ తయారవుతున్న ఉత్పత్తుల గురించి పరిశ్రమ సిబ్బంది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అరటి పంట కోత వ్యయం తగ్గించేందుకు రోప్‌వే తరహా పద్ధతిని రాయలసీమ జిల్లాలో కూడా తీసుకురావాలని జైన్ అధికారులకు సూచించారు. అరటి, బొప్పాయి ఇతర పండ్లమొక్కల సరఫరాకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యంతో జైన్ పరిశ్రమ అభివృద్ధి కుంటు పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఈ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇందులో వందశాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో దాసు, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, జైన్ పరిశ్రమ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్‌బాబు, జైన్ పరిశ్రమ లైజనింగ్ అధికారి మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పేర్కొన్నారు. పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శాయ్, అస్మిత రగ్బీ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి మహిళా రగ్బీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పోటీ పడ్డారు. 20 జట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు విజేత జట్లకు రూ.50 వేల ప్రథమ, రూ.30 వేల ద్వితీయ, రూ.20 వేల తృతీయ బహుమతులు, ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేయనున్నట్లు వివరించారు. శాయ్ పరిశీలకుడు చంద్రశేఖర్, ముంబయికి చెందిన రగ్బీ జాతీయ సంఘం మేనేజర్ వికాస్‌చౌరాశియా, శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్‌శెట్టి, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేష్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



రగ్బీ ఆడుతున్న విద్యార్థినులు

ముగిసిన అండర్-14 ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డా.బద్రీష్, డీఎస్‌ఏ అధికారి ఎంఎన్‌వి రాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. అనంతరం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల విజయవంతానికి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, పోలీసులు, పురపాలక, ఆరోగ్యశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాఘవేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా కార్యదర్శి దండే నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రముఖులు, వ్యాయామ ఉపాధ్యాయులు

పార్కుకు తాళం..బుగ్గన అసహనం

ఈనాడు, కర్నూలు, డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణానికి శుక్రవారం ఉదయం తాళాలు వేయడంపై మాజీ మంత్రి బుగ్గన అసహనం వ్యక్తం చేశారు. 2023లో ఈ కార్యాలయం లోపల చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కు, యోగాకు వేదిక, మరుగుదొడ్లను వైకాపా హయాంలో నిర్మించారు. మాజీ మంత్రి బుగ్గన అప్పుడప్పుడు ఉదయపు నడకకు ఇక్కడికి మిత్రులతో వచ్చి పలు విషయాలు చర్చిస్తుంటారు. వాకింగ్ ట్రాక్‌లో నడక వ్యాయామం చేసేందుకు వస్తున్నామని తెలిసి ఉద్దేశపూర్వకంగా లోపలికి వెళ్లకుండా గేటుకు తాళం వేశారని బుగ్గన ఆరోపించారు. ఇండోర్ స్టేడియం పక్కన క్లబ్‌హౌస్ నిర్మించి ఆరునెలలైనా తెరవలేదని, తాము వాకింగ్‌కు వస్తామని చెప్పి బంద్ చేయించి, కమిషనర్ తన కారును ఉంచి ఎవర్నీ లోపలకు రానివ్వకుండా, వాడుకోకుండా తాళం వేశారని, కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఎత్తడంలేదని ఆరోపించారు. బుగ్గన ప్రత్యర్థులు మాత్రం ఉదయపు నడక, యోగా, క్రీడల సాధనకు డోన్ పట్టణంలో ఉద్యానాలు, క్రీడా మైదానాలు ఉండగా పురపాలక కార్యాలయంలోకి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణాన్ని కార్యాలయ అవసరాలకు కాకుండా ఇతర వాటికి వినియోగిస్తున్నారని, మాజీ మంత్రి ఇంటికి సమీపంలోనే ఉద్యానాలు, క్రీడామైదానాలు ఉన్నా.. పుర కార్యాలయంలోనే ఉదయపు నడక చేస్తాననడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ జాకీర్‌హుస్సేన్, వైకాపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గేట్ల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల నుంచి గుంజలపాడుకు వెళ్లేదారిలో ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వకు పడిన గండిని శుక్రవారం యుద్ధప్రాతిపదిక పూడ్చే పనులు చేపట్టారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మొదటి రోజు 70శాతం పనులు చేశామని, శనివారం నాటికి పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయనున్నట్లు శాఖ ఏఈ సురేంద్ర తెలిపారు. గండి శాశ్వత పరిష్కారానికి లైనింగ్‌తో కలిపి 10 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పుతో రూ.2.40 లక్షలతో అంచనాలు తయారుచేశామని, నిధులు మంజూరు కాగానే వేసవిలో పనులు చేపడతామని ఆయన తెలిపారు.

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : మెదడు నుంచి ముక్కుకు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చి వేసేందుకు కోతలు, కుట్లు లేకుండా చేపట్టిన అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు మధుమణి ఆసుపత్రి వైద్యుడు డా.మధుసూదన్‌రావు తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన లక్ష్మీదేవికి ముక్కు నుంచి ధారగా నీళ్లు కారేవన్నారు. ఎమ్మారై స్కాన్‌లో మెదడు ముక్కుకు మధ్యలో ఉండే ఎముకకు రంధ్రం ఏర్పడటంతోనే నీరు ముక్కు నుంచి బయటకు వస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఈ పరిస్థితిని సీఎస్ఎఫ్ రైనోరియా అంటారని వివరించారు. దీనికి నంద్యాల మధుమణి నర్సింగ్‌హోమ్‌లో అధునాతన పరికరాలతో డా.చిత్తలూరు మణిదీప్, సీనియర్ వైద్యులు డా.మధుసూదన్‌రావు, సహాయ ఈఎన్‌టీ వైద్యుడు రోహిత్, మత్తుమందు నిపుణులు డా.మాధవి కలిసి ఈనెల 23న శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డా.మధుసూదన్‌రావు

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,26,281 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో శుక్రవారం జలాశయం రెండు వరద గేట్లను పది అడుగుల మేర పైకెత్తి 55,782 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ మరో 67,006 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటి మట్టం 884.60 అడుగులు, నీటినిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదైంది.



స్పిల్‌వే నుంచి విడుదలవుతున్న నీరు

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి


నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా పేర్కొన్నారు. నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు పోలీసు సిబ్బంది తమ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

గొడ్డలితో నరికి భర్తను హతమార్చిన మహిళ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఓ మహిళ కట్టుకున్న వాడినే కడతేర్చిన ఘటన కృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన చిట్యాల ఆదిరామిరెడ్డి (35)కి ఎర్రగొండపాలెం మండలం గంజివాయిపల్లెకు చెందిన లక్ష్మీదేవితో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఆదిరామిరెడ్డి మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగున్నాడన్న కారణంతో ఆరేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన లక్ష్మీదేవి గొడ్డలితో భర్తపై దాడి చేసింది. తలపై తీవ్ర గాయాలు కావడంతో ఆయన మంచంపైనే చనిపోయారు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. చీకటి పడుతున్నా ఇంటికి తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు కిటికీలోంచి చూడగా ఆదిరామిరెడ్డి రక్తపుమడుగులో పడున్నారు. ఈ విషయాన్ని వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ, గ్రామీణ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.



ఆదిరామిరెడ్డి (పాతచిత్రం)



నిర్మాణాలపై విచారిస్తున్న తితిదే ఏఈఈ లక్ష్మీపతి

రూ.25 కోట్ల తితిదే నిధులతో అభివృద్ధి పనులు

మహానంది, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలో రూ.25 కోట్ల తితిదే నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తితిదే ఏఈఈ లక్ష్మీపతి చెప్పారు. మహానందిలో రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న తితిదే వసతి గదుల సముదాయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రౌండ్ లెవెల్‌లో వసతి గదులు నిర్మించామని, దీనిపైన మరో రూ.3 కోట్ల తితిదే నిధులతో మహానంది దేవస్థానం వారే గదులు నిర్మించుకుంటారని తెలిపారు. నంద్యాల, బేతంచెర్ల మండలం సీతారామాపురం, ఎస్.కొంతలపాడు, డోన్ మండలం ఉడుములపాడు, ఎస్.గుండాలు, యాగంటి తదితర క్షేత్రాల్లో తితిదే నిధులతో చేపట్టిన నిర్మాణాలు మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీకి సభలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : దివ్యాంగులకు అవసరమైన పరికరాలను గుర్తించి పంపిణీ చేసేందుకు ఇక నుంచి ప్రతి మండలంలో సభలు నిర్వహిస్తామని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఎండీ కె.ఇస్మాయిల్ తెలిపారు. దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అవసరమైన ట్రైసైకిళ్లు, బ్యాటరీ ట్రైసైకిల్, వినికిడి యంత్రం, చంక కర్రలు, ల్యాప్‌టాప్, టచ్ ఫోన్లు, యూడీఐడీ కార్డు తదితర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శుక్రవారం దివ్యాంగులకు అవసరమైన పరికరాల గుర్తింపు కోసం సభ నిర్వహించారు. డా.ఎన్.చంద్రకాంత్ మాట్లాడుతూ 85 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న వారు రూ.15 వేల పింఛను కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరిత, దివ్యాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

వంకలో పడి వ్యక్తి మృతి


డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని చాకిరేవుమిట్ట వద్ద ఉన్న వంకలో పడి చాకలి అశోక్ (28) మృతి చెందినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాకలి ఈశ్వరయ్య కుమారుడు అశోక్ మద్యానికి బానిసయ్యాడని, ఎక్కడపడితే అక్కడ పడిపోతుంటాడని, విసుగుచెందిన భార్య కొంతకాల కిందటే ఆయన్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. రెండు రోజుల కిందట చాకిరేవుమిట్ట సమీపంలో ఉన్న శివాలయం పక్కన ఉన్న వంకలో ప్రమాదవశాత్తు అశోక్ పడి ఊపిరాడక మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

మాతాశిశు సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, తల్లీబిడ్డల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని గోకవరం, ఎర్రమఠం ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ విభాగం, మందుల గదులను పరిశీలించారు. కాన్పుల గదిని పరిశీలించి వీలైనంత వరకు గర్భిణులకు సాధారణ ప్రసవం జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. ఎర్రమఠం గూడెంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.



ఎర్రమఠంలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

30న జిల్లాస్థాయి కుస్తీ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 30న జిల్లాస్థాయి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కుస్తీ సంఘం కార్యదర్శి రాబర్ట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : **సమస్య :** పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు.
- రంగస్వామి, స్థానికుడు

సమస్య : నూనెపల్లె సూర్యనారాయణ స్టోర్ ప్రాంతంలో ఇంటింటి నుంచి చెత్త సేకరించడం లేదు.
- ఫక్కీరయ్య, స్థానికుడు

సమస్య : పట్టణంలోని బైరమల్ వీధిలో కుక్కల బెడద అధికమైంది. **- నాగరాజు, స్థానికుడు**

సమాధానం : సిబ్బందికి సూచించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. చెత్త తీసుకెళ్లేలాగా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే కుక్కలను పట్టిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని సీహెచ్‌సీ వైద్యుడు కాంతారావు నాయక్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబూరాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఆత్మకూరు సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన పీపీఎన్‌డీటీ సమావేశంలో వారు మాట్లాడారు. సీహెచ్‌సీ పర్యవేక్షకులు డాక్టర్ రాయుడు, డాక్టర్ కవిత, సీఐ ఓబులేసు, మెరీబా స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజరు జుల్ఫీకర్ అలీఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు శివకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధమవ్వాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : నవంబరు 21, 22, 23 తేదీల్లో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సమాయత్తం కావాలని తహసీల్దారు అల్ఫ్రేడ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను నవంబరు 15లోగా పూర్తిస్థాయిలో తయారు చేయాలని చెప్పారు. ఉప తహసీల్దారు గురునాథం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సక్షం..

★ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు
★ ప్రత్యేకంగా నిధులు కేటాయించిన ప్రభుత్వం

అంగన్‌వాడీలకు మోక్షం

ప్రాజెక్టు | గర్భిణులు | బాలింతలు
0-6 నెలల్లోపు చిన్నారులు
6 నెలలు- ఏడాదిలోపు వారు
1- 3 ఏళ్లలోపు పిల్లలు
3- 6 ఏళ్లలోపు చిన్నారులు
సక్షంకు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలు

	నంద్యాల	ఆత్మకూరు	నందికొట్కూరు
గర్భిణులు	2,542 మంది	1,690 మంది	1,740 మంది
బాలింతలు	2,518 మంది	1,774 మంది	1,947 మంది
0-6 నెలల్లోపు చిన్నారులు	2,540 మంది	1,780 మంది	1,961 మంది
6 నెలలు- ఏడాదిలోపు వారు	2,832 మంది	1,992 మంది	1,917 మంది
1- 3 ఏళ్లలోపు పిల్లలు	10,176 మంది	6,892 మంది	7,514 మంది
3- 6 ఏళ్లలోపు చిన్నారులు	9,443 మంది	5,536 మంది	7,008 మంది
సక్షంకు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలు	6	10	33



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సక్షం (స్టిములేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మెనేజ్‌మెంట్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సొంత భవనాలున్న 101 కేంద్రాలను ఎంపిక చేశారు. వీటిలో వివిధ పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేశారు. వీటితో కేంద్రాలను చిన్నారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. ఆరేళ్లలోపు చిన్నారుల నుంచి గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, పరిరక్షణే ధ్యేయంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారనున్నాయి.



సక్షంకు ఎంపికైన పాణ్యం ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రం

లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహణ - లీలావతి, ఐసీడీఎస్ పీడీ, నంద్యాల

సక్షం పథకం కింద ఎంపికైన కేంద్రాలను లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించేలా సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే అన్ని సదుపాయాలు కల్పించనున్నాం. ఈ పథకం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాహారం లభిస్తుంది.

నిధుల కేటాయింపు ఇలా..

పోషకాహారం కోసం	: రూ.10 వేలు
ఇంకుడు గుంతల ఏర్పాటుకు	: రూ.16 వేలు
మౌలిక వసతుల కల్పనకు	: రూ.19,800

కల్పించే సదుపాయాలు

✦ చిన్నారులకు కుర్చీలు, టేబుళ్లు, ఇతర వసతులు సమకూర్చనున్నారు.
✦ ఈ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఆట వస్తువులు, రకరకాల బొమ్మలు, చిత్రాలను అందుబాటులో ఉంచుతారు.
✦ చిన్నారులను ఆకట్టుకునే విధంగా ఆట పాటల ద్వారా పాఠాలు బోధించనున్నారు.
✦ సురక్షితమైన తాగునీరు అందించేందుకు నీటిశుద్ధి యంత్రాలు అమర్చనున్నారు.
✦ పోషణ వాటిక పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కల పెంపకం చేపడతారు. పండించిన తాజా కూరగాయలతో ఆహారం వండి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పెట్టనున్నారు.

సగం పని.. వాహనదారులకు హాని



నంద్యాల పట్టణ శివారులోని వైఎస్సార్‌నగర్‌లో నీళ్లట్యాంకు వద్ద సీసీ రహదారి ప్రమాదకరంగా మారింది. నందమూరినగర్ నుంచి వైఎస్సార్ నగర్‌కు వెళ్లే దారి మధ్యలో తాగునీటి పైపులైన్‌కు సంబంధించిన నాలుగు వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఈ మార్గంలో సీసీరోడ్డు వేశారు. వాల్వ్‌లు ఉన్న ప్రాంతాన్ని వదిలేసి అటూఇటు సీసీరోడ్డు వేశారు. దీంతో ఈ కొంత ప్రాంతం గుంతలా మారింది. విశాలమైన రోడ్డు ఇక్కడ ఇరుకుగా మారింది. వాహనదారులు ఒకవైపే ప్రయాణించాల్సి వస్తోంది. రాత్రిళ్లు ప్రయాణించే వారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఈ గుంతలోపడి ప్రాణాలుపోయే ప్రమాదం ఉంది. సీసీ రహదారిని పూర్తిగా నిర్మించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రచనలో మెరిశారు.. విజేతలుగా నిలిచారు



పోటీల్లో పాల్గొన్న రోటరీ పాఠశాల విద్యార్థులు



బహుమతులతో విజేతలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని రోటరీ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జ్ఞానేశ్వరి, చేతన్‌నాయక్, అఫిపాలకు ప్రిన్సిపల్ సుబ్బయ్య, ఉపాధ్యాయులు మస్తాన్, సుష్మ బహుమతులు అందజేశారు.



వ్యాస రచనలో విజయవాణి పాఠశాల విద్యార్థులు



బహుమతులు అందుకున్న విజేతలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలోని విజయవాణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం'పై అనే అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి. 9వ తరగతి విద్యార్థినులు దిల్‌షద్ ప్రథమ, సానియా ద్వితీయ, 8వ తరగతి విద్యార్థిని పూజిత తృతీయ స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు వేణు, బాషా బహుమతులు అందజేశారు.

ఫెన్సింగ్ పోటీలపై ఫిర్యాదు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు అనంతపురం జిల్లాకు చెందిన ఓ క్రీడాకారుడి తండ్రి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ అక్రమాలపై శిక్షకుడిని ప్రశ్నిస్తే తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని వాపోయారు. క్రీడాకారులు ఆడే వీడియో లేకుండా చేశారని, వాళ్లకు అనుకూలమైన వారి వీడియోలు మాత్రమే ఉంచారని ఆరోపించారు. ఇక్కడ జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి క్రీడాకారులకు జరిగిన అన్యాయాన్ని తేల్చాలని డిమాండు చేశారు.

ఆళ్లగడ్డ జట్టు విజయం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అండర్- 15 జాతీయ మహిళా రగ్బీ పోటీల్లో ఆళ్లగడ్డ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల (పడకండ్ల) పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. నందికొట్కూరు మండలం లక్ష్మాపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల ద్వితీయ, ఆళ్లగడ్డ గురుకుల పాఠశాల ఆర్బీ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలైన జట్లకు నగదు బహుమతులు అందజేశారు.

వేధింపులు ఆపాలంటూ నిరసన

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : గ్రామీణ తపాలా ఉద్యోగులను లక్ష్యాల పేరుతో వేధించడం ఆపాలని, వారి సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎఫ్‌పీఈ నాయకులు ఎస్ఎస్ రావు, నాగమణి, ఏఐజీడీఎస్‌యూ నాయకుడు శశికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఎస్ తపాలా కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ నాయకులు, తపాలా ఉద్యోగులు నిరసన చేపట్టారు. మితిమీరిన లక్ష్యాలు, కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను వెంటనే ఆపాలని కోరారు.

ముఖద్వారం.. ముప్పు తథ్యం



శ్రీశైల క్షేత్రానికి వెళ్లే రహదారిలోని ముఖద్వారం సమీపంలో శ్రీశైలం- హైదరాబాద్ రహదారి గుంతలమయమైంది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు, సందర్శకులు శ్రీశైలానికి వస్తుంటారు. ముఖద్వారం సమీపంలోని మలుపు వద్ద రోడ్డంతా గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

ఎరువుల నిల్వలు టన్నుల్లో చూపండి



నిల్వలు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ఎరువుల దుకాణదారులు నిల్వలను బస్తాల్లో కాకుండా టన్నుల్లో చూపాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆదేశించారు. నందికొట్కూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, గోదాముల్లోని నిల్వలను సరిచూశారు. అనంతరం రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను రైతుల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు విజయశేఖర్, మండల వ్యవసాయాధికారి షేక్‌షావలి పాల్గొన్నారు.

27న రాష్ట్ర మహాసభ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాలలో ఈనెల 27న ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న వార్షిక రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అబులైస్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్‌పాషా పిలుపునిచ్చారు. స్థానిక ఆల్‌మేవా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నేషనల్ పీజీ కళాశాలలో నిర్వహించే మహాసభకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ముస్లిం, క్రైస్తవ మైనారిటీ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

జూదరుల అరెస్టు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని నారపురెడ్డికుంట అటవీ శివారులో జూదమాడుతున్న ఏడుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. వారి నుంచి రూ.54 వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డ్రోన్ల వినియోగం లాభదాయకం

వెలుగోడు, న్యూస్‌టుడే : వ్యవసాయంలో డ్రోన్ల వాడకం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. వెలుగోడు మండలం గుంతకందాల గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో డ్రోన్లను ఉపయోగించి పంటలకు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారని వివరించారు. దీనివల్ల వ్యవసాయ కూలీల సమస్యను అధిగమించడమే కాకుండా పురుగు మందులపై పెట్టే ఖర్చు 40 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏవో పవన్‌కుమార్

పోలీసు సిబ్బందికి వ్యాస రచన పోటీలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' అనే అంశాలపై పోలీసు సిబ్బంది వ్యాసాలు రాశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ యుగంధర్‌బాబు మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.



పోటీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

పంట కొనుగోలులో మోసాలపై అప్రమత్తం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పంట కొనుగోలులో వ్యాపారులు పాల్పడే మోసాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై తిరుపాలు ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలు, చోరీలు, సైబర్ నేరాలు, పంట కొనుగోలులో మోసాలపై అవగాహన కల్పించారు.



గ్రామస్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై ఓబులేసులకు ఆదేశించారు. మిడుతూరు ఠాణాను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు.

ఇంటి నిర్మాణ బిల్లులు వెంటనే చెల్లించండి

గడివేముల, న్యూస్‌టుడే : ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పక్కా ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా సిబ్బందిని ఆదేశించారు. గడివేములలో శుక్రవారం ఆయన ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించారు. ఇంటి నిర్మాణం ప్రారంభమైన వెంటనే పునాది దశ, లెంటెల్ దశ, స్లాబ్ దశలో మస్టర్లు వేసి బిల్లులు చెల్లించాలన్నారు. గ్రామాల్లో 80 రోజుల పనిదినాలు పూర్తయిన కుటుంబాలను గుర్తించి వందరోజుల పనిదినాలు పూర్తి చేయించాలని సూచించారు. ఏపీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన రకం వరిపంట పరిశీలన

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని మణికంఠాపురం గ్రామంలో సాగు చేసిన కొత్త రకం వరిపంటను జపాన్ దేశస్థుడు కాజుమిచ్చి, జేఎఫ్ఈ స్టీల్ కార్పొరేషన్, భారత వరి పరిశోధన సంస్థ సాంకేతిక బృందం సభ్యులు శశి, గురుప్రకాష్, తివారి శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి రెండెకరాల్లో ఐరన్ కోటెడ్ వరి సాగు చేస్తున్నారు. ఈ పంట ఏ దశలో ఉందోనని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐరన్ కోటెడ్ వరి సాగు వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో భారత వరి పరిశోధన సంస్థ సిబ్బంది బి.వెంకటన్న, రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న జపాన్ దేశస్థుడు

విద్యావంతులైతేనే మంచి భవిష్యత్తు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : బాలికలు విద్యావంతులుగా మారినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆర్జీఎం పాఠశాల ప్రిన్సిపల్ గాయత్రి పేర్కొన్నారు. పాణ్యం చెంచుకాలనీలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సామాజిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు నాటకాలు, ఆట పాటలతో సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు చిన్నతనం నుంచే మంచి ఆహారం తీసుకోవాలని, ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని చదవాలని సూచించారు.

క్రీడలతో మానసిక వికాసం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : క్రీడలతో మానసిక వికాసం సాధ్యమవుతుందని క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు డివిజన్ క్రీడా భారతి నూతన కమిటీ ఎంపికలో భాగంగా శుక్రవారం జగద్గురు మఠంలో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు తాలూకా క్రీడా భారతి అధ్యక్షుడిగా గుణంపల్లి పురుషోత్తంరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన క్రీడా భారతి కమిటీ సభ్యులు క్రీడల పట్ల ప్రజలను చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ, మండలాధ్యక్షులు జెట్టి వేణు, శివప్రసాద్‌రెడ్డి, క్రీడా భారతి జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి, అపుస్మా అధ్యక్షుడు మల్లయ్య, గంజి రాజశేఖర్, క్రీస్తుదాసు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర కమిటీ నాయకులు

ప్రతి ఇంటికి ఉచిత వంట గ్యాస్ అందించాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా ప్రతి ఇంటికి ఉచిత వంట గ్యాస్ అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి నిర్మల డిమాండ్ చేశారు. నంద్యాల తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఐద్వా నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం దీపావళికి ఉచిత గ్యాస్ అందిస్తామని చెబుతోందన్నారు. పౌర సరఫరాల శాఖకు మాత్రం ఇంకా విధివిధానాలు అందలేదన్నారు. జిల్లాలో 5.77 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అందులో 1.55 లక్షలు దీపం, 33,732 పీఎం ఉజ్వల యోజన కనెక్షన్లు ఉన్నాయని వివరించారు. వీరందికీ ఉచిత వంట గ్యాస్ అందించాలని కోరారు. ధర్నాలో నాయకురాళ్లు కృష్ణవేణి, భాను, విజయమ్మ, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

నేడు తెదేపా సభ్యత్వ నమోదు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో శనివారం నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు నరహరి విశ్వనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక రాజారెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నంద్యాల పట్టణంతో పాటు నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మల్లేశ్వరి, ఎంపీడీవో సుమిత్రమ్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని ప్రాతకోటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి శేషమ్మ, వైద్యాధికారి కృష్ణమూర్తి, ఈవోఆర్డీ నాగేంద్రయ్య, గ్రామ నాయకుడు నాగశేషులు పాల్గొన్నారు.

గొర్రెల వ్యాపారి ఆత్మహత్య

నందికొట్కూరు, న్యూస్‌టుడే : కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో పరిశీలించామన్నారు. అక్కడ లభించిన చరవాణి ఆధారంగా ఫోన్‌చేసి బంధువులను పిలిపించగా మృతుడు శ్రీనివాసులుగా గుర్తించారని చెప్పారు. గొర్రెల వ్యాపారం చేసే శ్రీనివాసులు సోమవారం పశువుల సంతకు వచ్చి సమీపంలోని పొలంలో పురుగుల మందు తాగాడన్నారు. అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు తెలిపారరన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

రూ.లక్ష విలువైన విద్యుత్తు తీగల చోరీ

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని టిడ్కో గృహ సముదాయంలో గురువారం రాత్రి విద్యుత్తు తీగలను దొంగలు చోరీ చేశారని గ్రామీణ సీఐ అస్రర్‌బాషా శుక్రవారం తెలిపారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

పట్టుదలతో ఆడుతూ.. పతకాలు సాధిస్తూ..

☛ జూడోలో రాణిస్తున్న విద్యార్థులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు జూడో క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. పాఠశాలలో శిక్షకుడి వద్ద శిక్షణ తీసుకున్నారు. కఠోర సాధన చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారు నందికొట్కూరులోని నవనంది పాఠశాల విద్యార్థులు పురంధర్, హిమతేజ. బరిలో వీరు పట్టు పడితే ప్రత్యర్థి చిత్తు కావాల్సిందే. ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇద్దరూ స్వర్ణ పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రశంసలు అందుకుంటున్నారు.

✸ పోటీల్లో విజయతేజం ✸



పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రమాదేవి దంపతుల కుమారుడు హిమతేజ. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. జూడో క్రీడ పట్ల ఆసక్తితో ఆరో తరగతి నుంచి శిక్షణ తీసుకుంటున్నాడు. నిత్య సాధన చేస్తూ మెలకువలు ఒంటబట్టించుకున్నాడు. పోటీల్లో పాల్గొంటూ జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాడు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడమే తన లక్ష్యం అంటున్నాడు హిమతేజ.

✸ పురంధర్ అదుర్స్ ✸



నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన శేఖర్, జయంతి దంపతుల కుమారుడు పురంధర్. నందికొట్కూరు పట్టణంలో పదో తరగతి చదువుతున్నాడు. క్రీడల పట్ల మక్కువతో 6వ తరగతి నుంచి జూడో నేర్చుకుంటున్నాడు. కరోనా సమయంలో శిక్షణకు దూరమైనా తర్వాత మళ్లీ సాధన మొదలుపెట్టాడు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధిస్తున్నాడు. ఈనెల 20, 21 తేదీల్లో శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం గెలుపొందాడు. నవంబరులో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఘనంగా కాలభైరవాష్టమి


కాలభైరవ స్వామి

పాతకందుకూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పాతకందుకూరు గ్రామంలో కాలభైరవస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మనక్షత్రం అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాలభైరవ స్వామి, కాళికామాతను పూజించారు.

సరకులు అందజేయాలి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రేషన్ కార్డు దారులకు నిత్యావసర సరకులు సక్రమంగా అందజేయాలని ఉప తహసీల్దారు మారుతీ ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. ప్యాపిలి నుంచి బేతంచెర్లకు బదిలీపై వెళ్లిన ఉప తహసీల్దారు మారుతీని ఎండీయూ ఆపరేటర్లు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పట్టణంలో విద్యుత్తుకోత

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున సుందరసింగ్‌కాలనీ, టీచర్స్‌కాలని, నెహ్రూనగర్, విజయటాకీస్, టీఆర్‌నగర్, తెదేపా కార్యాలయం, నారాయణ పాఠశాల తదితర ప్రాంతాల్లో శనివారం విద్యుత్తుకోత విధిస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574316
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

సంజామల: సమస్య: ముదిగేడు నుంచి సంజామల వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. –రాజు, ముదిగేడు.

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –సునీల్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ ఏడీ.

ఆళ్లగడ్డ గ్రామీణం: సమస్య: ఓబులంపల్లెలో ప్రధాన రహదారిపై మురుగు నిల్వ ఉంటోంది. ఇబ్బందులుపడుతున్నాం. –ఓబులేసు.

సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. –తాహెర్ హుసేన్, ఈవోపీఆర్డీ.

సమస్య: మిట్టపల్లెలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉంటుండటంతో దోమల వ్యాప్తి అధికమవుతోంది. –సుబ్రహ్మణ్యం, మిట్టపల్లె.

సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. –తాహెర్ హుసేన్, ఈవోపీఆర్డీ.

చాకరాజువేముల (దొర్నిపాడు): సమస్య: గ్రామంలోని ఉర్దూ పాఠశాల ఆవరణలోని మంచి నీటి ట్యాంకు పైపులు లీకవుతున్నాయి. –శ్రీను, చాకరాజువేముల.

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –నాగార్జున, పంచాయతీ కార్యదర్శి, చాకరాజువేముల.

అవీ.. ఇవీ.. అన్నీ..

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జూదం, నాటుసారా, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

డోన్ నేరవిభాగం: పాత బస్టాండ్‌లోని పలు దుకాణాల తాళాలను ఓ యువకుడు పగుల గొట్టే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. సీసీ పుటేజీల్లో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. ఇనుప రాడ్డుతో పాత బస్టాండ్‌లోని మూడు దుకాణాల షట్టర్లను కొట్టగా... అవి రాకపోవడంతో వెనుదిరిగాడు.

డోన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశారని, నిరుద్యోగులకు ఇది వరమని, మెగా డీఎస్సీలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఏపీ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయుల సంఘం నాయకుడు లోకేశ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు.

ఆళ్లగడ్డ: పట్టణంలో ఆవోపా(ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) సభ్యురాలైన సుధామణి తన పుట్టిన రోజు సందర్భంగా వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బల్లలను విరాళంగా అందించారు. పాఠశాల అభివృద్ధికి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయుడు డా.ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు వీర రాఘవయ్య పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలో వాల్మీకి బోయ సంఘ కమిటీలను నియమించినట్లు మండల కార్యదర్శి బాల హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దొర్నిపాడు మండలంలో వాల్మీకి సంఘ అధ్యక్షుడిగా రామదాసు, గ్రామ అధ్యక్షులుగా పెద్ద ఉసేని, బుర్రారెడ్డిపల్లెకు చెందిన విజయ కుమార్‌లను, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

బేతంచెర్ల: పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మండల విద్యాధికారి సోమశేఖర్, ఉప తహసీల్దారు మారుతీ పేర్కొన్నారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలకు దుర్గాపేట కాలనీకి చెందిన జ్ఞానదీప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువ చేసే మైక్ సెట్, బెంచీలను శుక్రవారం అందజేశారు.

ఉయ్యాలవాడ: గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గృహదర్శన కార్యక్రమాన్ని చేపట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి అన్నారు. ఉయ్యాలవాడ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: వైకాపా నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గోపాలనగరం గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నాళ్లీ కాపలా..?

ఇసుక నిల్వపై రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలపై సీజ్ చేసిన ఇసుక రెవెన్యూ సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఆగస్టు 23న పట్టణ పోలీసులు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారనే అభియోగంపై ఐదు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి వాటిని సీజ్ చేశారు. కేసు నమోదవ్వడంతో వాహన యజమానులకు జరిమానా విధించిన న్యాయస్థానం ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించాలని ఆదేశించింది. దీంతో పోలీసులు వాహనాల్లోని ఇసుకను పక్కనే ఉన్న తహసీల్దారు కార్యాలయం ఎదురుగా పోగు చేసి దాదాపు రెండు నెలలుగా కాపలా కాస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని ఇసుకకు ఇంకా ఎన్ని రోజులు కాపలాకాయాలోనని ఆలోచిస్తున్నారు.

వంతులవారీగా

దాదాపు రెండు నెలలుగా ఈ ఇసుకకు ఇద్దరు వీఆర్వోలు, పదుల సంఖ్యలో వీఆర్ఏ (గ్రామ సహాయకులు) వంతుల వారీగా కాపలా కాస్తున్నారు. ప్రతిరోజు రాత్రి ఒక వీఆర్వో, ఇద్దరు వీఆర్ఏలు రాత్రి నుంచి ఉదయం వరకు కాపలా కాస్తున్నారు. వీఆర్వో, వీఆర్ఏలు ఇసుకకు రక్షణగా రాత్రంతా కార్యాలయంలోనే ఉంటున్నారు. సాధారణంగా దొరికిన ఇసుకకు ఎన్నడూ ఇలా తహసీల్దారు కార్యాలయంలో నిల్వ ఉంచిన పరిస్థితి తలెత్తలేదు. గతంలో దొరికిన ఇసుకకు జరిమానా విధించి వేలం వేయడమో, ఏదైనా ప్రభుత్వ పనులు చేస్తుంటే వారికి ఇవ్వడమో జరిగేది. ఈసారి అలా కాకుండా నెలల పాటు కార్యాలయంలోనే ఇసుకను ఉంచడం, దానికి రక్షణగా సిబ్బంది నియమించడం గమనార్హం.


ఇసుకకు కాపలాగా గ్రామ సహాయకులు

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు

–జ్యోతి రత్నకుమారి, తహసీల్దారు, ఆళ్లగడ్డ

సాధారణంగా ఇసుకను వేలం వేసి విక్రయించాలి. వేలం వేయమని ఇంకా ఆదేశాలు రాలేదు. ఎవరైనా ఇసుక అవసరం ఉన్న వారు కలెక్టర్‌తో మాట్లాడి వేలానికి అనుమతులు తెస్తే ప్రక్రియను నిర్వహించి ఇసుకను అప్పగిస్తాం. ఏదైనా ప్రభుత్వ పనులకు ఇసుక అవసరమైతే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి - బీసీ ఇందిరమ్మ

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు దూరం కావాలని కోరారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇందిరమ్మ

ఖేలో ఇండియా పోటీల్లో మూడోస్థానం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా క్రీడల్లో భాగంగా రగ్బీ పోటీల్లో ఆళ్లగడ్డ డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులం జట్టు మూడోస్థానంలో నిలిచారు. నంద్యాలలో శుక్రవారం జరిగిన ఉమ్మడి జిల్లా గురుకుల విద్యాలయాల పోటీల్లో ఆళ్లగడ్డ జట్టు రాణించి కాంస్య పతకాన్ని సాధించింది. వారికి జ్ఞాపికతో పాటు రూ. 20వేల నగదు పురస్కారం అందించారు.


సత్తా చాటిన విద్యార్థులు

హరివరం(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: హరివరం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కార్తీక షణ్ముఖప్రియ అండర్ 14 విభాగంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఉపాధ్యాయులు తెలిపారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం ఆదర్శ పాఠశాలకు చెందిన హర్షిత రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు.

పసుపుల (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: పసుపుల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని కల్పన అండర్-14 కబడ్డీ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర శుక్రవారం తెలిపారు.

బనగానపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.దిలీప్ నాయక్ ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు డి.నాగరాజు తెలిపారు.

విద్యుత్తు ఉప కేంద్రం తనిఖీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి విద్యుత్తు ఉప కేంద్రాన్ని శుక్రవారం రాత్రి ఎస్‌ఈ సుధాకర్ తనిఖీ చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు.


ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ

అన్ని అనుమతులు పొందాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బాణసంచా విక్రయదారులు అన్ని అనుమతులు పొందాలని తహసీల్దారు జ్యోతి రత్నకుమారి తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, బాణసంచా విక్రయదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు

సమస్యల పరిష్కారానికి చర్యలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు తెదేపా కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించి మాట్లాడారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని పరిశీలించి అధికారులకు పరిష్కరించాలని చెబుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగిన ప్రజలకు న్యాయం చేస్తామన్నారు.

సాగు, తాగునీరు అందించాలి: సీపీఐ

డోన్, న్యూస్‌టుడే: డోన్ నియోజకవర్గంతో పాటు పశ్చిమ ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించాలని సీపీఐ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు

రచనల్లో ఆదర్శం..బహుమతులతో ఆనందం


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పిల్లల్లో ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఉందని నారాయణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ కె.ఈరన్న పేర్కొన్నారు. శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని నారాయణ ఆంగ్లమాధ్యమం పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పి. తన్మయ్‌శ్రీ (9వ తరగతి), డి.మహాలక్ష్మి (8వ తరగతి), ఎం.సాయి కృతిక శ్రీ (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. వైస్ ప్రిన్సిపల్ ఈరన్న, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, బాల మద్దయ్య, రమేష్, నాగభూషణం, తదితరులు బహుమతులు అందించారు.


ప్రశంసాపత్రాలు, బహుమతులు పొందిన విద్యార్థులు

రిమ్స్‌లో గర్భిణి మృతి... బంధువుల ఆందోళన

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: రిమ్స్‌లో కాన్పు నిమిత్తం వచ్చిన గర్భిణి మృతిచెందడంతో వారి బంధువులు ఆందోళన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని వారు ఆరోపించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం... నంద్యాల జిల్లా చాగలమర్రి తండాకు చెందిన శ్యామలాబాయికి నెలలు నిండటంతో 23న రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఇది రెండో కాన్పు. పరిశీలించిన వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఆమెకు ఫిట్స్ వచ్చి, ఉమ్మనీరు గుండెను తాకడంతో మృతి చెందిందని శుక్రవారం కుటుంబసభ్యులకు చెప్పారు. వెంటనే శస్త్రచికిత్స చేసుకుంటే బతికేదని, వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డ ఇద్దరూ చనిపోయారని కుటుంబసభ్యులు వాపోయారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణికి ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చాయని, ఆ సమయంలో వైద్యం పూర్తిస్థాయిలో అందించినా ఆమె కోలుకోలేకపోయిందన్నారు. వైద్యులు ఎంత శ్రమించారో వారి బంధువులకు కూడా తెలుసని చెప్పారు. ఈ ఘటనపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేస్తామని, వైద్యుల వైపు నుంచి తప్పుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మట్టిమిద్దె కూలి మహిళ దుర్మరణం

సంకాలపురం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మట్టిమిద్దె కూలడంతో ఉమామహేశ్వరమ్మ(40) మృతి చెందారని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి, ఉమామహేశ్వరమ్మ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. మధ్యాహ్నం భోజనం చేసి రామసుబ్బారెడ్డి బయటకు వెళ్లి వ్యవసాయ పని చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు మట్టిమిద్దెకూలింది. ఇంట్లో ఉన్న మహేశ్వరమ్మ మట్టిలో కూరుకుపోయింది. స్థానికులు మట్టిని తొలగించగా ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులున్నారు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధించినందుకు భర్త, అత్త, మామ, మరిదిపై కేసు నమోదు చేసినట్లు రేవనూరు ఎస్సై భూపాలుడు శుక్రవారం తెలిపారు. కలుగొట్లకు చెందిన శిరీషకు దొర్నిపాడుకు చెందిన వెంకట శివకుమార్‌తో గత ఏప్రిల్‌లో వివాహమైంది. అదనపు కట్నం ఇవ్వాలని వేధిస్తుండటంతో బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఏనుగుమర్రి గ్రామ సమీపంలో ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్ పట్టణం కొండపేటకు చెందిన విష్ణు అక్కడికక్కడే మృతి చెందగా, డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం మధును కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

మృతదేహాన్ని గుర్తించండి

బనగానపల్లి, న్యూస్‌టుడే: తమ్మడపల్లె రోడ్డులో ఈనెల 23న ఎస్సార్బీసీ సబ్ కాలువలో లభించిన మహిళ మృతదేహానికి శవపరీక్షలు పూర్తయినట్లు ఎస్.ఐ.దుగ్గిరెడ్డి శుక్రవారం తెలిపారు. బంధువులు ఎవరైనా వచ్చి గుర్తుపడితే పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 9121101042 నంబరుకు ఫోన్‌చేసి వివరాలు చెప్పాలన్నారు.

పశుగణనకు సహకరించండి

చాగలమర్రి, న్యూస్‌టుడే: 21వ అఖిల భారత పశుగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వరప్రసాదు కోరారు. చాగలమర్రి పట్టణంలో తెదేపా రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా పశుగణన గోడపత్రికలను ఆయన విడుదల చేసి మాట్లాడారు.


గోడ పత్రికలను విడుదల చేస్తున్న అన్సర్‌బాషా

సంజామల, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన పశుగణనకు సహకరించాలని మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ముదిగేడు సర్పంచి అరుణమ్మ కోరారు. శుక్రవారం ముదిగేడులో మండల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు మోహన్‌రావు ఆదేశాల మేరకు ఏహెచ్ఏ మహబూబ్ బేగ్ 21వ అఖిలభారత పశుగణన చేపట్టారు. ముఖ్యఅతిథులుగా మండల ఉపాధ్యక్షుడు, సర్పంచి గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పాడిపరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిర అన్నారు. కోవెలకుంట్లలోని పశువైద్యశాలలో 21వ అఖిలభారత పశుగనణ కార్యక్రమాన్ని ఆమె గోడపత్రికలు విడుదల చేసి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. బిజినవేముల పశువైద్యాధికారి కృష్ణకుమార్, తెదేపా నాయకులు గడ్డం నాగేశ్వరరెడ్డి, మురళీ, శేఖర్, నాగేంద్ర, శిలువయ్య, రాజు, కుళాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని యర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచారిణి డాక్టర్ ఇంద్రావతి పేర్కొన్నారు. శుక్రవారం యర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచారిణిగా ఆమె బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్ పరిశీలన

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: నెహ్రూనగర్ మున్సిపల్ పార్కులో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో పాటు వైస్ ఛైర్మన్ కొత్రికె హరికిషన్ శుక్రవారం సందర్శించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు.

అరెస్టు చేయాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త(సొ.అ.వ)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ అధ్యక్షుడు బి.హుస్సేన్ బాషా డిమాండు చేశారు. ప్రవక్తపై యతి నరసింహానంద స్వామి చేసిన వాఖ్యలకు నిరసనగా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వందలాదిగా ముస్లింలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

కష్టాలే తోడు

డోన్, నేరవిభాగం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. గత ప్రభుత్వం ఎటువంటి నిధులు విదల్చకపోవడంతో జనాలు అవస్థలపాలవుతున్నారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. మల్లెంపల్లె లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. తెదేపా హయాంలో డోన్ జాతీయరహదారి నుంచి దొరపల్లి, లక్షుంపల్లి, మల్లెంపల్లె మీదుగా బొంతిరాళ్ళ వరకు బీటీ రోడ్డు వేశారు. మల్లెంపల్లె నుంచి బొంతిరాళ్ళకు కాలువల్ని నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన మురుగు సీసీరోడ్లపై నిలిచిపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. మురుగు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు. కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగు రోడ్డుపైనే నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మల్లెంపల్లె నుంచి బొంతిరాళ్ళకు వెళ్ళే ప్రధాన రహదారి

చెత్తతో అవస్థ

దొరపల్లిలోకి ప్రవేశించగానే చెత్త దర్శనమిస్తోంది. డోన్ నుంచి దొరపల్లికి వెళ్లే దారికి ఇరువైపులా చెత్త నిండిపోవడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయని నివాసితులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని, రోగాలబారిన పడుతున్నామని చెబుతున్నారు. గ్రామ సచివాలయానికి సమీపంలోనే చెత్తపోగులు ఉన్నా తొలగించడం లేదని చెబుతున్నారు.


దొరపల్లిలో రహదారికి ఇరువైపులా పారబోసిన చెత్త

లక్షుంపల్లిలో మురుగు ప్రవాహం

లక్షుంపల్లిలో సీసీ రహదారులపై మురుగు పేరుకుపోతోంది. గ్రామంలో సీసీ రహదారులు కొన్ని కాలనీలల్లో లేకపోవడంతో కంకర రహదారులపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని నివాసితులు చెబుతున్నారు. కాలువల్ని కూడా ఎప్పటికప్పుడు శుభ్రపర్చకపోవడంతో మురుగుపారడం లేదని చెబుతున్నారు. కాలువల్ని శుభ్రం చేయాలని నివాసితులు కోరుతున్నారు.

అధికారుల గైర్హాజరుపై అసహనం

ప్యాపిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించారు. కొందరు అధికారులు సమావేశానికి గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దారు భారతి, ఈవోఆర్డీ బాలకృష్ణ, ఈవో శివకుమార్‌గౌడ్, పీఆర్‌ఏఈ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

పల్లె కబుర్లు

ఓబులంపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం): ఓబులంపల్లెకు చెందిన తెదేపా కార్యకర్త గైబుసా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకున్న తెదేపా నేత భార్గవ్‌రామ్ ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబీకులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అమడాల(కోవెలకుంట్ల గ్రామీణం): అమడాలలో శుక్రవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రబీ పంటల బీమా ప్రీమియాన్ని రైతులు బ్యాంకులు, గ్రామ సచివాలయాల్లో చెల్లించి రశీదులు పొందాలన్నారు.

అమడాల (కోవెలకుంట్ల గ్రామీణం): అమడాలలో శనివారం గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు.

అవుకు: భూ సర్వే సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని శుక్రవారం జరిగిన గ్రామసభలో మెట్టుపల్లె రైతులు అధికారులను కోరారు. గత ప్రభుత్వ నిర్వహించిన సమగ్ర భూసర్వేతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు.

కలుగొట్ల(కోవెలకుంట్ల గ్రామీణం): కలుగొట్లలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై 59 వినతులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కటికవానికుంట (బనగానపల్లి గ్రామీణం): రైతులు లాభసాటి వ్యవసాయం చేపట్టాలని మండల వ్యవసాయఅధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కటికవానికుంటలో ఆయన ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

డి.వనిపెంట(చాగలమర్రి): రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని డీటీ విజయ్‌కుమార్ తెలిపారు. డి.వనిపెంటలో గ్రామ సభను నిర్వహించారు.

క్రిష్టిపాడు (దొర్నిపాడు): క్రిష్టిపాడులో తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో శుక్రవారం రీసర్వే సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. దాదాపు 90 ఫిర్యాదులు అందాయన్నారు.

గ్రంథాలయానికి సమస్యల చెద

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు... విజ్ఞాన భాండాగారాలు. ఇక్కడి పుస్తకాలు చదివి ఎంతోమంది కొలువుల్ని సంపాదించి జీవితాల్లో స్థిరపడ్డారు. అటువంటి కోవెలకుంట్లలోని గ్రంథాలయం సమస్యలతో సతమతమవుతోంది. కోవెలకుంట్లలో సుమారు 30 వేలకు పైగా జనాభా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 19, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 4, డిగ్రీ కళాశాలలు 2, బీఈడీ కళాశాల 1, ఐటీఐ కళాశాల 1, అగ్రి పాలిటెక్నిక్ కళాశాల 1 ఉన్నాయి. ఆయా కళాశాలల విద్యార్థులు పుస్తకాలు చదవడానికి గ్రంథాలయానికి వెళ్దామంటే ఇక్కడి సమస్యలు వారికి ఇబ్బందుల్ని కలిగిస్తున్నాయి.

ఏయే ఇబ్బందులంటే..?

ఇక్కడికి రోజూ 80 మంది వరకు పాఠకులు గ్రంథాలయానికి వస్తుంటే కేవలం 10 కుర్చీలు మాత్రమే ఉండటంతో కూర్చొనేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతర్జాలంలో పుస్తకాలు చదివేందుకు మూడు కంప్యూటర్లు ఉండగా అయిదేళ్లుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. నెట్ బిల్లులు ఎక్కువగా వస్తుండటంతో వీటిని మూలన పెట్టేశారు. తాగునీటికి శుద్ధ జల యంత్రాన్ని అమర్చగా మూడేళ్లుగా ఇది పనిచేయకపోవడంతో బయట నుంచి మంచి నీటిని తెప్పిస్తున్నారు.



మూతపడిన పుస్తక విభాగం గది

కోవెలకుంట్ల గ్రంథాలయంలో రెగ్యులర్ గ్రంథాలయాధికారి లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గత గ్రంథాలయాధికారి రాఘవరెడ్డి జూన్‌లో ఉద్యోగ విరమణ చేయగా సంజామల గ్రంథాలయాధికారి బాలతిమ్మారెడ్డిని ఇక్కడ ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారిగా నియమించారు. వారంలో కొన్ని రోజులు కోవెలకుంట్లలో, మరికొన్ని రోజులు సంజామలలో విధులు నిర్వహిస్తున్నారు. కోవెలకుంట్లలో సోమ, బుధ, శనివారాల్లో మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో పుస్తక విభాగం ఉన్న గది ఈ మూడురోజులు మాత్రమే తెరిచి ఉంటుంది. మిగిలిన రోజుల్లో మూసేస్తుండటంతో పాఠకులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రస్తుతం డీఎస్సీ, రైల్వే, బ్యాంక్‌లకు సంబంధించి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయంలో పుస్తకాలు సకాలంలో లభ్యం కాక ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ గ్రంథాలయాధికారిని నియమించాలని కోరుతున్నారు.

రోజూ వచ్చే పాఠకులు: 80 వరకు, మొత్తం పుస్తకాలు: 16,234
సభ్యత్వం కలిగిన పాఠకులు: 2,255 మంది
ప్రతి 15 రోజులకోసారి ఇంటికి పుస్తకాలు తీసుకెళ్లేవారు: 38
పోటీ పరీక్షల పుస్తకాలు: పోలీసు కానిస్టేబుల్, డీఎస్సీ, టెట్, ఇంజినీరింగ్ పోటీ పరీక్షల పుస్తకాలు సుమారు 1000 ఉన్నాయి.

రెగ్యులర్ అధికారిని నియమించాలి

– అలీ అబ్బాస్, పాఠకుడు



డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. గ్రంథాలయంలో పరీక్షలకు అవసరమైన పుస్తకాలు తీసుకొని చదువుకుందామంటే ఇక్కడ రెగ్యులర్ గ్రంథాలయాధికారి లేక ఇబ్బందులు పడుతున్నా. ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి ఉండటంతో ఆయన కోవెలకుంట్లలో మూడురోజులు, సంజామలలో మూడురోజులు విధులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షల పుస్తకాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.